**కథ**

# నీ..మనసే మాలాలి

ఎం.ఎల్. సూర్యకాంతం

**ఊరి రచ్చబండ దగ్గర ఆటో దిగిన లావణ్య అక్కడ గోలీలు ఆడుతున్న కుర్రాళ్లను పిలిచి "లక్ష్మీదేవమ్మగారి ఇల్లెక్కడ?" అనగానే- "ఎవరా?" అన్నట్టు తెల్లమొహం వేశారు.**

పదకొండు గంటలకే ఎండ తీవ్రంగా ఉండడంతో పైట చెంగు తలపై ముసుగు వేసుకుని అటుగా నడిచింది. ఇళ్లలోని జనం ఆమెని వింతగా మాస్తున్నారు. ఆ ఇంటి గేటు ముందు ఆగగానే.. మేనుకి చల్లని గాలి తాకి హాయిగా అనిపించింది. ఆ ఇంట్లో మనుషులున్న జాడలేని లేనట్టు పాడుబడి వుంది. కానీ ముంగిలి కొంత మేర తుడిచి నీళ్లు వల్లి ముగ్గు వేసి ఉంది కనుక మనుషులుంటున్నారని అనుకోవచ్చు. పూర్వ కాలం నాటి ఆ లోగిలి చుట్టూ ఆకాశాన్నంటేలా సంవత్సరాల తరబడి పెరిగిన ఎత్తయిన చెట్లు, నేలంతా రాలిన ఆకులు, పుల్లలు వున్నాయి. చెట్లపై చేరిన పక్షుల కిలకిలలు శ్రవణానందంగా వుంది. వాకిలికి ఇరువైపులా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు అస్తవ్యస్తంగా వున్నాయి.

తుప్పు పట్టిన ఇనుపగేటు తీసుకుని మెల్లగా పరిసరాలు గమనిస్తూ ఇంటి వరండా దగ్గరకొచ్చేసరికి మూలపడుకున్న కుక్కలేచి భౌమంటూ మీదికి రాబోయింది. చిన్నగా ఈలవేసి చిటికె వేసేసరికి తోక ఊపుతూ దగ్గరకొచ్చింది. వారగా వేసిన తలుపులోంచి తల బైటకి పెట్టి "ఎవరూ..." అంటూ చూసిందొక వృద్ధురాలు.

లావణ్యను చూస్తూనే "ఎవరిల్లనుకొచ్చావో.. అమ్మాయీ.. వెళ్లు.. వెళ్లు.." అంటూ తలుపు మూయబోతుంటే సూట్‌కేసు వదలి పరుగున వెళ్లి తలుపు తోస్తూ "మీ ఇంటికేనండీ?" అంది గబగబా.

"మా ఇంటికా.. కాదు.. కాదు.." అని తలుపేస్తుంటే-

"ఒక్కసారి బయటికి రండమ్మా. నేను మీ ఇంటికే వచ్చాను" అంది జాలిగొలిపేలా ముఖం పెట్టి.

ఆమె ప్రశ్నార్థకంగా చూస్తూ "మా ఇంటికొచ్చే బంధువులు ఎవరూ లేరే.. మరి నువ్వు?" సందేహంగా చూస్తూనే అంది.

"అది కాదమ్మా.. మీ ఇల్లు పెద్దదనీ.. ఎన్నో గదులుంటాయనీ.."

"సరి.. సరి.. అద్దెకా.. అదేం కుదరదు. నేను అద్దెకిస్తానని చెప్పిన వెధవ ఎవడు?" అంది కోపంగా.

"అది కాదమ్మమ్మగారూ..."

"ఇదిగో అమ్మాయ్! వరస కూడా కలుపుతున్నావ్. నాకిలాంటివి నచ్చవు. సరే.. త్వరగా చెప్పి తగలడు, కుంపటిపై అన్నం మాడుతుంది" అంది విసుగ్గా కోపం కలిపి.

"అమ్మగారూ.. నాకెవరూ లేరమ్మా.. బ్రతుకు తెరువేదీ లేక ఈ ఊళ్లో చిన్న కాన్వెంట్ పెట్టుకుందామని వచ్చాను. ఊళ్లో కాస్త స్థిరపడేదాక ఇక్కడ నీడనివ్వండమ్మా" అంది దీనంగా.

"సరే.. ఆడకూతురివని ఇస్తున్నా.. నీ ఏర్పాట్లు కుదిరే వరకూ ఈ ముందు గదిలోనే వుండు" అంది.

'హమ్మయ్య' అని లోలోన సంతోషించి వంగి రెండు పాదాలకి నమస్కరించింది లావణ్య.

"ఇదిగో.. పిల్లా.. నాకిలాంటి నక్క వినయాలు నచ్చవ్. పెరట్లో నుయ్యి వుంది, పోయి కాళ్లు, ముఖం కడుక్కురా. ఈ పూటకి నేనే కాస్త ముద్ద పడేస్తా" అని లోనికెళ్లిందావిడ.

★ ★ ★

ముద్ద పప్పు, గడ్డపెరుగుతో ఆవిడ పెట్టిన భోజనం తిని, గది శుభ్రం చేసుకుని, వరండా అంతా కడిగి సుద్దతో ముగ్గులు పెట్టింది. పెరటివైపు చల్లగాలికోసం వెళ్లేసరికి ఆమెని చూసి చిలకల గుంపు ఎగిరిపోయింది. కింద రాలిన జాంపండ్లు, గంగరేగు పండ్లు, పండి రాలిన పసుపు పచ్చని నారింజ, బాదం పండ్లు చూసేసరికి కళ్లు జిగేల్మన్నాయి. అవన్నీ ఒక బుట్టలోకి ఏరి బావి దగ్గర శుభ్రంగా కడిగింది. అటుగా వచ్చిన లక్ష్మీదేవమ్మ అవి చూసి- "అవన్నీ ఎందుకే పిల్లా?" అంది.

"నేను తింటాను అమ్మమ్మగారూ.. మిగిలినవి ఎవరికైనా ఇవ్వచ్చనీ..."

"ఇదిగో.. నీకెన్నిసార్లు చెప్పను.. నన్నలా పిలవకు" అని కోపంగా తిట్టి "ఈ పళ్లు ఎవరికైనా పెట్టేవనుకో ఇక నన్ను చంపుకు తింటారు. లోపలికి తగలడి నా కొంప గందరగోళం చేస్తారు. నువ్వు తిన్నన్ని తిని, పారేయ" అని హుంకరించింది.

ఆమె మనస్తత్వాన్ని అంచనా వేసుకుంటూ నిలబడిపోయింది లావణ్య.

ఆమె కోపం, అసహనం, కసి ఎవరి మీద? అనుకుంది.

★ ★ ★

పూజగదిలో నుంచి బయటకొచ్చిన లక్ష్మీదేవమ్మ పెరడు శుభ్రం చేస్తున్న పనిమనిషి సుబ్బి మొగుడు రాముని చూసి- "ఒరే రాము.. ఆ ఎండు పుల్లలన్నీ పట్టుకుపోవాలనా ఈ శుభ్రం?" అంది.

"కాదమ్మగారూ.. మీ ఇంటికి చుట్టాలమ్మాయిగారు వచ్చారంట కదా.. ఆమె మా సుబ్బితో ఇంటి చుట్టూ శుభ్రం చేయడానికి మనిషిని చూడమన్నారటమ్మా.. అందుకు నేనే వచ్చా.." ఎండు పుల్లలు ఓ పక్కకి సర్దుతూనే చెప్పాడు.

"ఏమిటి? ఈ పిల్ల చొరవ. పోనీలే అని నీడనిస్తే నన్నడగక ఈ పనుల పురమాయింపు.." అని అరచుకుంటూ లోపలికొచ్చిన లక్ష్మీదేవమ్మ మరింత ఆశ్చర్యపోయింది.

లావణ్య, సుబ్బి కొంగులు బిగించి ఒక్కో గది దులిపి శుభ్రం చేస్తున్నారు. ఏమో అనబోయి 'పోన్లే నాకెలాగు ఓపిక లేదు, శుభ్రం చెయ్యనీ' అనుకుని వంట పనిలో నిమగ్నమైంది. అంతరంగంలో ఆనందపు సవ్వడి.


★ ★ ★

ఆ ఇంటికి చిన్న చిన్న మరమ్మత్తులు చేయించి, ఇంటి చుట్టూ పనికి రాని చెట్లు నరికించి, ఇంటికి సున్నం వేయించి, కరెంటు వేయించి, ముందు భాగంలో రకరకాల పూలమొక్కలు నాటించేసరికి పదిహేను రోజులు పట్టింది లావణ్యకి.

అందంగా ఉన్న ఇంటినీ... పరిసరాల్ని చూసిన దేవమ్మగారు- "ఈ నీ పెత్తనమేమిటి పిల్లా.. నీ మాయలతో నన్ను దోచుకుపోవాలనా? నా దగ్గరేం లేదు సుమా" అంది.

"అవును. దోచుకుపోదామనే.. మీ మనసు.." అంటూ తన పనులన్నీ పూర్తి చెయ్యసాగింది.

"అనాథనన్నావు, బ్రతుకు తెరువుకోసం కాన్వెంటన్నావు. అవన్నీ మాని నాకోసం ఖర్చు చేస్తున్నావు. ఇంటికి ఖర్చుపెడుతున్నావ్. నీ బ్రతుకేం



కాను పిచ్చిమొహమా.. ఆలోచించుకోవే..'' అంది అయోమయంగా.

''ఇది నా ఇల్లు కాదా అమ్మమ్మగారూ..''

''ఏమిటీ! ఇది నీ ఇల్లా?'' అంది ఆశ్చర్యపోతూ.

''అదే... అంటే.. నేనున్నాను కదా.. మరి నా సొంతిల్లుగానే అనుకోవాలి కదా. అదీగాక ఈ వరండా, హాలు, ఖాళీయే కదా. ఇక్కడే కాన్వెంట్ పెడితే బాగుంటుందని...'' అంది అసలు విషయం చెప్తూ.

''నీ పెత్తనం పాడుగానూ.. నన్నడక్కుండా ఇవన్నీ పురమాయించేస్తున్నావా? నీకెంత ధైర్యం? ముందు నా ఇంట్లోంచి బయటికిపో..'' అంది కోపంగా.

''అమ్మమ్మగారూ.. చిన్న పిల్లలు నడయాడుతుంటే ఎంత బాగుంటుంది. కోపం మాని కాస్త ఆలోచించండి''

''ఇదిగో పిల్లా! నన్ను విసిగించకు. కొంపని ఇలాగే నాతోపాటే పాడుబడనీ.. దీనికింకా కళకళలు వద్దు. వద్దమ్మా. అలాంటి ప్రయత్నాలేమీ చెయ్యకు''

ఆమె కంఠంలో జీర, ఆవేదన, కళ్లలో కన్నీటి పొర దాచాలని ప్రయత్నించినా దాగలేదు. ఆ కోపం, కాఠిన్యం వెనక దాగిన వెన్నలాటి ప్రేమని లావణ్య బాగానే గ్రహించింది. ఆ ప్రేమని తన ప్రేమతో కరిగించాలని అనుకుంది లోలోన.

★ ★ ★

హాస్పిటల్‌లో చెక్ చేయించి, మందులు కొని, పాలు పళ్లు శ్రద్ధగా వాడేలా చూసి పడక వరకూ సౌఖ్యాలనమర్చిన లావణ్య అంటే వల్లమాలిన ప్రేమ కలిగింది దేవమ్మకి.

''ఈ పిల్లకి తనకి ఉన్న రుణానుబంధమేమిటో.. కాస్తంత నీడ ఇచ్చినందుకే తన కోసం ఇంత ఆరాటపడుతోంది. పిచ్చి పిల్ల'' అనుకుంది ఆప్యాయంగా. తనకు ఆ పిల్ల తోడుందన్న భావం ఎంతో ఆనందంగా అనిపించింది దేవమ్మకి.

ఒక్కగానొక్క కన్నకూతురు తన స్వార్థం చూసుకుని, తమ ప్రేమని కాలదన్ని ప్రేమించినవాడ్ని పెళ్లాడి వెళ్లిపోతే, ఆ బెంగతోనే కట్టుకున్న మహారాజు పోయాడు. తన బ్రతుకులో ఏం మిగిలింది కనుక. అప్పటి నుంచీ, వీధి మొహం చూడక ఇంట్లోనే కృంగి, కృశించి.. పోయిన ఈ ముసలి ప్రాణానికి లావణ్య మూలంగా సంతోషం కలుగుతోంది. ఏనాటి అనుబంధమో అనుకోగానే ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి.

హార్లిక్స్ గ్లాసుతో వచ్చిన లావణ్య ఆమె దీనవదనం చూసి చలించిపోయింది.

''అమ్మమ్మగారూ! నేను రోజూ చూస్తూనే వున్నాను. మీలో మీరే బాధ పడుతున్నారు'' అంది ఆప్యాయంగా.

''బాధ కాదు తల్లీ, ఆనందం. చావుకి సిద్ధమైన నా బ్రతుక్కి సంతోషాన్నిస్తున్నావు. మనది ఏం బంధమో'' అంది.

''అమ్మమ్మగారూ! మీరు నన్ను తిట్టినా పర్లేదుగానీ .. మీ మనసులో ఉన్న బాధ, నాక్కాస్త చెప్పకూడదా? నన్నింకా పరాయిదాన్లాగే చూస్తున్నావు'' అంది నిష్ఠూరంగా.

''నా బాధ చెప్తే పోయేది కాదు. ఎవరూ తీర్చలేనిది. చెప్పి మాత్రం ఏం లాభం?'' దిగులుగా అని అంతలోనే ఉలిక్కిపడ్డట్టు గంభీరంగా మారిపోయింది.

''నీ పని చూసుకో.. పో..'' అంది.

అదేమీ పట్టించుకోని లావణ్య, ''నేను మీ బిడ్డలాంటి దాన్నే. మనసులో బాధ ఎవరితోనైనా చెప్పుకుంటే మనసు తేలిక పడుతుంది అమ్మా!'' అంది పట్టువిడవక.

జారిన కన్నీటిని కొంగుతో తుడుచుకుని-

''ఏమని చెప్పను? మాది చాలా నిష్ఠగల కుటుంబం. మీ తాతగారు... అంటే మావారు టీచరుగా చేసేవారు. అందరికీ ఏ పని కావాలన్నా సాయపడే వారు. ఊరి బాగోగులు చూసేవారు. అలాగే ఒక లైబ్రరీ వచ్చేలా చేశారు. లైబ్రేరియన్‌గా వచ్చిన గోపాల్‌కి మా ముందరి గదిలో వసతి కల్పించారు. నేను ముందు వద్దన్నాను. 'పిల్లవాడు యోగ్యుడు లక్ష్మీ' అంటే సర్లేమని ఒప్పుకున్నా. అప్పటికి మా వైష్ణవి అంటే మా గారాల కూతురు పొరుగూళ్లో డిగ్రీ చదివేది. ఆ మాయగాడు మా వైష్ణవిని ఎలా వలలో వేసుకున్నాడోగానీ మాకు విషయం తెలిసేసరికి అది మమ్మల్ని లెక్కచేయని స్థితికి వచ్చింది. కులం, సంప్రదాయం అన్న మా మాటల్ని వినకుండా, మేమెలాగూ ఒప్పుకోమని, అన్నవరం వెళ్లిపోయి పెళ్లిచేసుకుని వచ్చేశారు. ఆయన కుప్పలా కూలబడిపోయారు. గడపదాటి లోనికి రావద్దన్నాం. ఇప్పుడే కాదు మేము బ్రతికున్నంత కాలం మొహం చూపించవద్దన్నాం. వెనుతిరిగి ఇద్దరూ వెళ్లిపోయారు. మనకి పిల్లలే పుట్టలేదనుకుందాం అని ఒకరినొకరం ఓదార్చుకున్నాం. కానీ... ఆయన నిజంగా కోలుకోలేకపోయారు. మనోవ్యధతో, అన్ని రకాల వ్యాధులు వచ్చి రెండేళ్లకే... నన్నొంటరి చేసి పోయారు. బంధువులూ మొహం చాటేశారు. ఊళ్లో వాళ్లూ ఆయన చేసిన ఉపకారాలు మర్చిపోయారు. అప్పటి నుంచీ నాకు ఈ మనుషులన్నా, లోకమన్నా కోపం, అసహ్యం. నమ్మించి నా బిడ్డను దూరం చేసిన భ్రష్టుడు వాడు. కన్నవాళ్లను వేదనకు గురిచేసిన బిడ్డ అది. అందుకే... అందుకేనమ్మా... నాకు ఈ ప్రేమానురాగాలు, బంధాలు అంటే నమ్మకం పోయి ఇలా మోడులా ఒంటరిగా..'' అంటూ దుఃఖంతో మాట్లాడలేకపోయింది.

కాసేపు ఆమెనలాగే ఏడవనిచ్చింది లావణ్య.

''అమ్మమ్మగారూ... నేనోమాట చెప్తాను వినండి'' అంది ఓదార్పుగా.

''వినడమే.. చెయ్యగలిగిందేముంది కనుక...'' అంది నిర్లిప్తంగా.

''మీది అగ్నిని నీటితో కడిగే వంశమే కావచ్చు. మీ ఒక్కగానొక్క కూతురిని ఎంతో క్రమశిక్షణతోనే పెంచి వుంటారు. అంత విచక్షణ లేక ఆమె ప్రేమించి వుండదు.

అతను యోగ్యుడే అన్నారు కదా! కాస్త నిదానంగా ఆలోచించి పెళ్లి జరిపిస్తే మీ పెద్దరికం నిలబడేది కదా. జరిగేది జరగక మానలేదు.

ఇప్పుడు మీకు ఆమె దూరమై, ఆమెకు మీరు దూరమై బాధ పడుతున్నారు''

''నిజమే లావణ్యా! అది ప్రేమించిందంటే మేం పెళ్లి చేయాలా? బయట మా పరువేం కాను? లోకం ఏమంటుంది? శాస్త్రిగారమ్మాయి ఎవరినో ప్రేమించిందంటే ఎంత తలవంపు? అని మధనపడిపోయాం. అప్పటి పరిస్థితులు అలాంటివమ్మా'' అంది.

''పోనీ... ఆ తర్వాతైనా వాళ్ల గురించి తెలుసుకున్నారా?''

''లేదమ్మా! ఇక దాన్ని పూర్తిగా మర్చిపోడానికే ప్రయత్నించాం. కుటుంబ పరువూ పోయే.. తర్వాత నా యజమానీ పోయే.. అదెలాపోతే నాకేం అని విరక్తి పెంచుకున్నా''

''అమ్మమ్మగారూ! ఎంతసేపూ లోకం, పరువు, ప్రతిష్ట అంటున్నారు. వాటికోసం కన్నబిడ్డని దూరం చేసుకున్నారు కదా! ఇప్పుడవన్నీ మీకు శాంతినిస్తున్నాయా? వాటి వల్ల మీకేమైనా ఒరిగిందా? మిమ్మల్నసలు ఎవరైనా పట్టించుకుంటున్నారా?'' అంది నిలదీస్తున్నట్టుగా.

ఆమె ఏమీ సమాధానం చెప్పలేదు. మనసులో అంతర్మథనం.

''బయటి వాళ్లు మనం చేసే ప్రతి పనినీ చెప్పుకుంటారు. అది మంచిదైనా, చెడ్డదైనా సరే. కొన్నాళ్లు మాత్రమే చెప్పుకుంటారు. అంత మాత్రానికే మన అంతరాత్మని చంపి లోకం పరువూ అంటూ పోతే ఆ శిక్ష ఒక జీవిత కాలం''

''నువ్వు చెప్పేది నిజమే లావణ్యా! మేమేమైపోయామో అన్నది దానికీ వుండాలి కదా. మరెప్పుడూ రాలేదా భ్రష్టురాలు'' అంది కోపంగా.

''మీరే కదా.. మొహం చూడొద్దు పొమ్మన్నాం అన్నారు. పాపం ఎట్లా వస్తుంది. ఎంత వేదన పడి వుంటుందో కదా''

''ఆయన పోయాక 'అమ్మ' మనసు చంపుకోలేక ఎంతో వేదన చెందాను తప్ప వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నించలేదు.

అయినా మా బంధువులతో రాకపోకలు లేక నాకు... నాకేమీ తెలీలేదు.

ఇక ఈ జీవితానికింతే ప్రాప్తం. ఆయనకిచ్చే ఫించనుతో నా బ్రతుకూ తెల్లారిపోతుందిలే'' అంది నిర్వేదంతో.

''అలా డీలా పడకండి అమ్మమ్మగారూ.. మీకింకా చాలా జీవితం వుంది. మీరు ప్రేమ స్థానంలో ద్వేషాన్ని, కసినీ పెంచుకున్నారు. అదే మిమ్మల్నిలా తయారుచేసింది. మీకు ప్రేమించే మనసుండాలేగానీ జీవితం ఏ వయసులోనైనా ఎంత మధురమైనదో. ఉన్న కొద్ది జీవితాన్నీ ఆనందమయం చేసుకోవచ్చు. ఉన్నవాళ్లని దూరం చేసుకుని గిరిగీసుకుని కూర్చుని ఏం సాధించారు? జరిగే మార్పులను గమనించి మనమూ మారడానికి ప్రయత్నించాలి. బాధలనూ, కన్నీళ్లనూ, నిరాశనూ.. ప్రేమిస్తూ పోతే అవే మనకు మిగిలి మరింత కృంగదీస్తాయి అమ్మమ్మగారు...'' అంది ఆమె మనసు మార్చటానికి ప్రయత్నిస్తూ.

''ఇంకా నా బ్రతుక్కి ఆనందమేమిటి పిల్లా! చనువిచ్చానని మరీ పేట్రేగిపోతున్నావు. నా బ్రతుకింతే... నన్నిలా చావనీ'' అంది కోపంగా.

''చావనివ్వను అమ్మమ్మగారూ.. మీ వైష్ణవి ఎక్కడున్నా వెతికి పట్టుకుని ఆమె పిల్లలూ, పిల్లల పిల్లలతో మీ భరతం పట్టిస్తాను'' అంది ఆటపట్టిస్తున్నట్టుగా.

''ఇప్పుడెక్కడుందో ఏమో... అది నన్ను పూర్తిగా మర్చిపోయే వుంటుంది'' వస్తే.. చూస్తే... బాగుండునన్న ఆశ ఆ తల్లి కళ్లలో కదలాడింది.

''ఆ భారం నాదన్నాను కదా అమ్మమ్మగారు. ఆమె రావడం మీకిష్టం. లోకం, సమాజం అనక నిశ్చింతగా ఉండండికా'' అంది ధీమాగా.

''నీ మాటలు వింటుంటే నాకు నిజంగానే ఆనందంగా ఉందే పిల్లా.. నీలో ఏం మంత్రాలున్నాయో ఏమో'' అంది సంతోషంగా.

''నాలో ఏం మంత్రాలు లేవు. మన ఆలోచన బట్టే మనసూ వుంటుంది.

జీవితం ఆనందమయమైనా, దుఃఖమయమైనా మనసే కారణం. వ్యతిరేక ధోరణి కాక అనుకూల ధోరణితో ఆలోచిస్తే సుఖంగా బ్రతికెయ్యొచ్చు అమ్మమ్మగారూ'' అంది ఉత్సాహంగా.

''సరే... నన్ను కూడా అలా బ్రతికించు మరి'' అంది మనస్ఫూర్తిగా.

ఇప్పుడామెకు లోకం, సమాజం కాక తన బిడ్డ, ఆమె బాగు కనబడుతోంది.

★ ★ ★

''అమ్మా! మన ప్లాన్ సక్సెస్'' అంటూ విషయాలన్నీ రాసి తల్లి వైష్ణవికి పోస్టు చేసి హాయిగా, నిండుగా నవ్వుకుంది లావణ్య.

